నిప్పును మూటగట్టకు!

డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ

చలి, చిక్కని చలి.

చిరిగిపోయిన వులెన్ మఫ్లర్ తలకు చుట్టుకొని, జేబులో రెండు చేతులు దూర్చుకొని, నల్లని తారురోడ్డు మీద ఒంటరిగా నడుస్తున్నాడు, రామక్రిష్ణ. నగరందాటి నాలుగు ఫర్లాంగులు వచ్చాడు. అయినా నగరం తాలూకు భవంతులు కొన్ని అక్కడక్కడ వున్నాయి.

రామక్రిష్ణకు కావలసింది అలాంటివే. వాటిల్లోనే దొంగతనం చెయ్యటానికి అవకాశం వుంటుంది. రామక్రిష్ణకు ఇది మొదటి దొంగతనం కాకపోయినా గుండెల్లో భయంగానే వుంది.

అప్పుడప్పుడు టాక్సీనో, లారీనో ఆ రోడ్డుమీద

దూసుకుపోతున్నాయి. అలా దూసుకుపోతున్నప్పుడు తన నెవరయినా గుర్తిస్తారేమో అన్న ఆందోళన లేకపోలేదు.

చుక్కలు మిణుకు మిణుకు మంటున్నాయి. మంచు లాంటి చలిగాలి వీస్తూనే వుంది. మిణుగురులు గోడ్లమీద తారాడుతున్నాయి.

హఠాత్తుగా ఓ భవంతిముందు ఆగాడు.

రెండస్తుల మేడ మబ్బురంగులో వుంది. ఆధునికంగా అతి రమణీయంగా కట్టబడి వుంది. మేడచుట్టూ కంఠహారంలా ప్రహరి. ప్రహరికి భవంతికి మధ్య గార్డెన్. పగలయితే రంగురంగుల మొక్కలు కనిపించేవేమో! రాత్రి కాబట్టి అన్నీ నల్లగానే వున్నాయి.

రెండువైపులా చూసి ప్రహరి ఎక్కి లోపలకు దిగాడు. మెల్లిగా ఎలుకను పట్టే పిల్లిలా అడుగులో అడుగువేసు కుంటూ భవంతి కిటికీ దగ్గరకు నడిచాడు. అద్దం కిటికీలో నుండి లోపలకు చూశాడు.

అంతా చీకటిగా వుంది.

అందరు గాఢనిద్రలోవున్నారు అనుకున్నాడు. దగ్గరలో వున్న జామచెట్టుమీదగా పైకెక్కాడు. గుండెల్లో వణకు, అరిచేతులకు చెమటలు, గొంతు తడారిపోతూంది. చెట్టు మీదుగా పైభాగంలో వున్న లాన్ లోపలకు దిగాడు. సోఫాసెట్టు వుంది. మెల్లగా గుమ్మం దగ్గరకు నడిచాడు. అద్దం తలుపు చిన్న ఇనుపచువ్వతో తీశాడు. లోపలంతా చీకటిగా వుంది.

ఎవరు ఏ గదిలో పడుకున్నారో తెలియటంలేదు. తను అలాగే ఎవ్వరికి కనిపించనని తృప్తిపడ్డాడు. మెల్లగా ఒక్కొక్క గదిలోనికి నడిచాడు.

డ్రెస్సింగ్ రూము అది. మెల్లగా అగ్గిపుల్ల వెలిగించాడు.

పెద్ద నిలువుటద్దం, టాయ్‌లెట్ సెట్, చిన్న బీరువా వగైరాలు వున్నాయి. గదంతా కలయచూశాడు.

కళ్ళు జిగేల్‌మన్నాయి. ఎదురుగా బల్లమీద రత్నాల హారం.

గబాలున అందుకొని జేబులో కుక్కుకున్నాడు. ఇంట్లో ఎవ్వరు వున్నట్లు అలికిడి లేదే? ఏమయివుంటారు? ఆలోచిస్తూనే బెడ్‌రూములోనికి నడిచాడు. బెడ్‌రూములో మంచాలు ఖాళీగా వున్నాయి.

డ్రెసింగ్‌రూము లోనికి నడిచాడు.

ఖరీదయిన చీరెలు, జాకెట్లు వున్నాయి. గబగబ నాలుగు చీరెలు కొన్ని రవికలు మూటకట్టుకున్నాడు. ఇంతకీ ఇనుప బీరువా ఏమయినట్లు అనుకుంటూనే ఇంకో గదిలోనికి వెళ్ళాడు. ఆ గది బయటనుండి క్రింది భాగానికి మెట్లున్నాయి. అవి మెట్లుకాదు వీలింగ్ చైర్ నడిచేటందుకు కట్టబడ్డ అనువయిన ఎత్తుపల్లాలు.

మెల్లగా క్రిందకు దిగాడు. సందేహంలేదు ఆ భవంతిలో అందరు వూరువెళ్ళి వుంటారు. కావలసినవన్నీ పేరుపేరున దోచుకోవచ్చు. అగ్గిపుల్ల వెలిగించాడు. ఎదురుగా దృశ్యం.

కలా? నిజమా? గుండాగిపోయి నట్లయింది. శిలా ప్రతిమలా అయిపోయాడు. అగ్గిపుల్ల అయ్యేవరకు అట్లాగే వుండిపోయాడు. అత్రుతగా మరో అగ్గిపుల్ల వెలిగించాడు.

ఎదురుగా తల పగిలి రక్తంమడుగయిన స్త్రీ శవం. ఎప్పుడు చచ్చిపోయిందో తెలీదు. తల పగలటంతో ముఖమంతా రక్తసిక్తమయి వుంది. ఆమె ప్రక్కనే ప్రక్కకు పడిపోయిన వీలింగ్ చైర్. ఆ అగ్గిపుల్ల ఆరిపోయింది. మరొకటి వెలిగించలేదు.

గబాలున వెనుతిరిగి మతిపోయినవాడిలా ఆ గది యీ గది కంగారుగా తిరిగి తరువాత వచ్చినవేపే చెట్టుమీద నుండి దిగబోయాడు. ఆ ఆతృతలో విరిగిన కొమ్మ చివర చేయి చీరుకుపోయింది. అయినా లక్ష్యపెట్టలేదు. చేతిలో చీరెల మూట వదలలేదు.

గబాలున ప్రహరి ఎక్కి దూకబోయాడు.

ఎదురుగా టాక్సీలైట్ల వెలుగు ముఖంమీద స్పష్టంగా కనుపించింది. రామక్రిష్ణ చెయ్యి అడ్డుపెట్టుకొని లోపలకు దిగి టాక్సీ వెళ్ళిపోయాక గోడదూకి బైటపడ్డాడు. పారి పోతున్న ఖైదీలా పరుగు ప్రారంభించాడు.

ఎవరో తరుముకొస్తున్నట్లు భయం వెంటాడుతోంది. చచ్చిన ఆ శవం కళ్ళముందు కదులుతూనే వుంది. యాంత్రికంగా ఇల్లు చేరాడు. మనసులో కంగారు, గుండెలలో భయం, ఆత్మలో ఆందోళన పిచ్చివాడ్ని చేస్తున్నాయి.

2

"నమస్కారమండి."

"నమస్కారమమ్మా ఎవరు కావాలి?" ప్రఖ్యాత డిటెక్టివ్ పి. జె. అడిగాడు.

"మీతోనే పనుండి వచ్చాను. మీ ఫోటో చాలాసార్లు పత్రికలలో చూసాను. మిమ్మల్ని ముఖాముఖిగా చూడటం ఇదే మొదటిసారి."

"నేను యీ వూరు రావటం డిటెక్టివ్ అయ్యాక మొదటిసారి."

"మీరు ఈ వూరు వచ్చారని తెలిసే నేను వచ్చాను" టైము ఒకసారి చూసుకుంది. "నా పేరు ఇందిర. మధు గార్డెన్స్ దగ్గర మా ఇల్లు. నేను మేరీస్ స్టెల్లాలో బి. ఏ.

ఫైనలియర్ చదువుతున్నాను. మా అక్క వసుంధర నిన్న చనిపోయింది" మాటల్లో తొందర కనిపిస్తుంది.

"అలాగా ఏమయినా వ్యాధా?"

"కాదండి స్పయిన్ యింజరీతో మూడు నెలలుగా వీలింగ్ చైర్ లోనే జీవితం గడుపుతోంది. నిన్న సాయంకాలం మా బావ మధురాధర్ వాసవిసంస్థ నిర్మాత మద్రాసు వెళ్ళాడు. మేము పెళ్ళికి నిడమనూరు వెళ్ళాం. ఆమె ఒకత్తె ఇంటి నౌకరు వున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుంది, అని అనుకుంటున్నారు."

"ఆత్మహత్య అయితే నేను చేయగలిగిందేముంది?"

"అది ఆత్మహత్య కాదని నా అభిప్రాయం."

"ఎలా అనుకుంటున్నారు?"

"ఫలానా కారణం అని చెప్పలేను. మా అక్కయ్య మనసు నాకు బాగా తెలుసు. ఇది ఆత్మహత్య అనటానికి ప్రత్యేకమయిన కారణంకూడా లేదు. పోలీసు రిపోర్టు యివ్వటం జరిగింది. పోలీసులు యీ పాటికి వచ్చేవుంటారు. మీరు త్వరగా రండి."

"పోలీసులు వస్తే వాళ్ళే చూసుకుంటారు గదా."

"అలా కాదు, దయచేసి మీరు రండి. పోలీసులు అసమర్థులు అని నేను అనటంలేదు. ఈ కేసులో నిగూఢమయిన కొన్ని విషయాలున్నాయి. ఇవి వాళ్ళకు అంతుపట్టక పోవచ్చు. ప్లీజ్ దయచేసి రండి" ఆతృతగా అనటంతో పి. జె. కదిలాడు.

"మీ బావ రాలేదా?"

"రాలేదు. మద్రాస్ స్వరూప్ హోటల్ కి ఫోన్ చేస్తే ఎక్స్ ప్రెస్ లో వస్తున్నట్లు చెప్పారు. ఈ పాటికి రావచ్చు."

"మీ యింట్లో యెందరు వున్నారు?"

"నేను, మా అమ్మ, మా బావ మధురాధర్, నౌకరు వుంటాం."

కారు రోడ్డుమీద హంసగమనంలా పదినిమిషాలు సాగింది. ఇందిర చెప్పిన డైరెక్షన్స్ ప్రకారం యింటి ముందు ఆగాపాడు. అప్పటికే పోలీసు వాను, ఇతర సిబ్బంది సిద్ధంగా వున్నారు.

రెండంతస్తుల భవంతి. చుట్టూ గార్డెన్‌లో రంగు రంగుల పూలమొక్కలు ఉన్నాయి. గార్డెన్ దాటి లోపలకు నడిచాడు పి. జె.

సబ్ ఇన్స్పెక్టర్ సెల్యూట్ చేసి "లోపలకు వెళ్ళండి" అన్నాడు.

అది విశాలమయిన హాలు. నేలమీద తివాసీ ఎరుపు రంగులో వుంది. ఖరీదయిన రోజ్‌వుడ్ సోఫాలు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్ బొమ్మలు, గోడలకు మోడరన్ ఆర్ట్ ఫిగర్స్ వున్నాయి. ఒకమూల రేడియోగ్రాము, మరొకవైపు ఫోను వున్నాయి. హాలులోనుండి రెండువైపుల పైభాగానికి మెట్లు వున్నాయి. మెట్లు మొదటిభాగంలో ఐదడుగుల గోడ, ఆ గోడకు చంద్రశేఖరంగారి ఫోటో వుంది. ఆ ఫోటోకి పూలదండ వేసివుంది.

"మా నాన్నగారు" అంది ఇందిర.

తల ఊపాడు పి. జె. జేబులోనుండి గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ తీసి వెలిగించాడు. తల తిప్పి ఆ ఫోటో యెదురుగా వున్న హతురాలి శవాన్ని చూశాడు. అప్పుడే ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీయటం ముగించాడు.

అన్నిగదులు కలయచూసి వస్తున్న క్రైమ్ బ్రాంచి ఇనస్పెక్టర్ విజయ్, పి. జె. ను చూసి "హల్లో! ఊరక

రాక మహాత్ములు, దివ్యదృష్టితో చూసి వచ్చారను కుంటాను'' అన్నాడు.

"నేను మహాత్ముడ్ని కాదండి, మనిషిని'' పి. జె. నవ్వాడు.

"మీ రాకకు కారణం?''

"నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?''

"మీరు అబద్ధం చెప్పినా, అందంగా చెపుతారు. బైదిబై రిగర్ మార్టిస్ గుర్తులు లేవు. పైగా శవం బిగుసుకు పోయింది. తలలోనుండి కారిన రక్తం గడ్డకట్టి పోయింది. కాబట్టి యీామె మరణం నిన్న జరిగివుండాలని నా అభి ప్రాయం.''

"ఐ. సి.'' పి. జె. అన్నాడు.

శవాన్ని చూశాడు. నుదురు పగిలి రక్తం కారి ముఖ మంతా వికృతంగా వుంది. అందమయిన అమ్మాయి సందేహంలేదు. సన్నగా, పొడవుగా, వొంపులు వుండ వలసినచోట్ల వంపులు వున్నాయి. ఎత్తయిన రొమ్ములు, నల్లని సాఫీజుట్టు, ఎర్రని పెదవులు కలవారి ఇంటి పడు చులా వుంది. వయసు పాతిక సంవత్సరాలు వుంటాయి. నీలంరంగు చీరె, అదేరంగు రవిక ధరించి వుంది. ప్రక్కకు పడటంచేత వాచి పగిలిపోయి వుంది. ఆ వాచీలో టైము ఐదు ముప్పైఐదు నిమిషాలయింది. ప్రక్కనే వీలింగ్ చైర్.

"ఇనస్పెక్టర్! ఇది హత్యా, లేక ఆత్మహత్యా?''

"వెరి సింపుల్ ఇది ఆత్మహత్య'' ఇనస్పెక్టర్ విజయ్ అన్నాడు.

"అయితే మీకు శ్రమ తగ్గిందన్నమాట'' పి. జె. అన్నాడు. క్షణం ఆగి విజయ్ ముఖంలోనికి చూసి "ఇది ఆత్మహత్య అని ఎలా నిర్ణయించారు?''

"నిన్నటిరోజున హతురాలు వసుంధర చెల్లెలు, తల్లి నిడమానూరు పెళ్ళికి వెళ్ళారు. భర్త మద్రాసు వెళ్ళాడు. ఇంటిలో ఒంటరిగా ఉన్న యీామె స్పయిన్ ఇంజరీ పేషంటు, వీలింగ్ చైర్ మీాదే యీామె జీవితం. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో ఆత్మహత్య చేసుకుంది. .38 కాలిబర్ రివాల్వర్ ఆమె చేతిలోనే ఉంది. లోపల గడియవేసి ఉంది. ఈ ఆధారాలు చాలనుకుంటాను ఆత్మహత్య అనుకోటానికి."

డాక్టర్ శవాన్ని చూసి పోస్టుమార్టమ్‌కు సిద్ధం చేశాడు.

"ఇందులో హేతువాదం ఏమీా లేదా?"

"నో. ఆలోచిస్తే అనుమానాలు పెనుభూతా లవుతాయి."

పి. జె. ఒక్కొక్క గది వెదకసాగాడు. ప్రక్కనే వున్న డ్రాయింగ్ రూములో పెద్ద గడియారం వుంది. గడియారం క్రింద టీపాయిమీాద ఒక చిన్న డైరిలాంటి పుస్తకం వుంది. చేతిరుమాలుతో పుస్తకం అందుకొని వేలిముద్రలు పోకుండా జాగ్రత్తగా పేజీలు తిప్పాడు. లోపల పేజీలో 4231 నెంబరు వుంది. ప్రత్యేకంగా వున్న ఆ నెంబరు ఏమిటి?

ఆలోచిస్తూనే మరొక గదిలోనికి నడిచాడు. అది డ్రస్సింగ్ రూము. ఆ గదిలో ఇందిర గబగబ వెతుకుతోంది.

"ఏమిటమ్మా?" పి. జె. ప్రశ్న. అప్పుడే గదిలోనికి వచ్చిన ఇనస్పెక్టర్ విజయ్ దగ్గరగా వెళ్ళాడు.

"నావి నాలుగు చీరెలు ఒక నెక్లెస్ కనిపించలేదు."

"పై భాగంలో చూశావా?"

"పైన వెదకే ఇక్కడకు వచ్చాను. నేను వెళ్లేటప్పుడు వున్నాయి, ఇప్పుడు లేవు" ఇందిర కంగారుగా అంది.

"మీ అక్క వాషింగ్ కి వేసిందేమో" ఇనస్పెక్టర్ అన్నాడు.

"మరి నెక్లెస్?" పి. జె. ప్రశ్న. ఇనస్పెక్టర్ తల విదిలించాడు.

పి. జె. నవ్వి "ఇనస్పెక్టర్ యీ ఇంట్లో ప్రతి అంగుళం వెదకటం మంచిది" అంటూ పి. జె. పాథాలజిష్టు దగ్గరకు వచ్చి "మిస్టర్ పాణి యీ డైరీమీద, టెలిఫోన్ మీద పై భాగంలో అవసరమయినచోట్ల వేలిముద్రలు తీయండి."

"సర్! పై భాగంలో లాన్ వైపు వున్న అద్దం తలుపు తెరిచే వుంది" సబ్ ఇనస్పెక్టర్ చెప్పటంతో అందరూ అక్కడకు వెళ్ళారు. లాన్‌లో ప్లాస్టిక్ కుర్చీలు, చిన్న పిట్టగోడ, గోడకు అనుకొని జామచెట్టు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" ఇనస్పెక్టర్ విజయ్ అడిగాడు పి. జె. ని.

"ఏంలేదు ఎదురు డోర్ వేయబడి వుంది. హంతకుడు ఇటునుండి వెళ్ళాడా? లేక ఇటునుండి వచ్చాడా?"

"అప్పుడే హత్య అని ధృవపరుస్తున్నారు."

పి. జె. నవ్వాడు. "నాకు అనుమానాలు ఎక్కువ. ఈ గదిలో చూడండి మొత్తం మూడు అగ్గిపుల్లలున్నాయి. అంటె దీపం ఆరిపోయాక యీ అగ్గిపుల్లలతో అవసరం కలిగింది అన్నమాట. దీపం ఆరిపోయింది కాబట్టే అగ్గిపుల్ల వెలిగించలేదు దీపాలు వెలగలేదు."

"దీపం లేక అని ఎందుకు అనుకోవాలి. ఏ సిగరెట్టు వెలిగించుకోవటానికి ఎందుకు కాకూడదు?"

"సిగరెట్టుకు మూడు అగ్గిపుల్లలు వేరువేరు గదుల్లో అవసరం ఏమిటి? పోనీ మీ రన్నట్లు మూడు సిగరెట్లయితే మూడు గదులలో వుండాలి కదా!" పి. జె. అనటంతో చిరాకు కలిగింది.

జామచెట్టు కొమ్మను నిశితంగా చూశాడు. చెట్టు కాండముమీద రక్తపు చుక్కలున్నాయి. ఇంకాస్త పైగా చీరుకుపోయిన చిన్న చర్మం వుంది.

"ఇనొక ఆధారం హంతకుడు ఎటునుండి పైకి ఎక్కినా ఇటునుండి క్రిందకు దిగాడు."

"అదెలా" ఇనస్పెక్టర్ ప్రశ్న.

"ఇనస్పెక్టర్ కాస్త ఆలోచించండి. కొమ్మ చీరుకు పోయింది ఇక్కడ రక్తపు చుక్కలు పడింది. అక్కడ ఎక్కినపుడు చీరుకుపోయినట్లయితే ఏ పరిస్థితిలోను అక్కడ రక్తం పడదు. మరొక విషయం హంతకుడు కంగారుగా దిగివుండాలి. అందుకే చీరుకుపోయింది. అంతేగాదు హంతకుడు యీ యింటికి అపరిచితుడు, పాత నేరస్తుడయి వుండాలి."

ఇనస్పెక్టర్ ఆలోచించాడు.

డిటెక్టివ్ అసిస్టెంట్ ధర్మ అప్పుడే వచ్చాడు. "మీ ఇద్దరు వచ్చారంటే ఇది హత్యే అనుకోవలసి వస్తుంది."

"మా ఇద్దరు రావటంవల్ల హత్యకాదు ఇది. హత్య కావచ్చు అని అనుమానం మీద ఇద్దరం వచ్చాం. మరొక ముఖ్యవిషయం రివాల్వర్ ట్రిగ్గర్ చూడండి. పాథాలజిష్టు రిపోర్టు ప్రకారం రివాల్వర్ మీద వేలిముద్రలు వున్నాయి. రివాల్వర్ ట్రిగ్గర్ మీద వేలిముద్రలు లేవు. అంటె ఎవరో ప్రయత్నం పూర్వకంగా మనల్ని తప్పుదారి పట్టించటానికి వేసిన పథకం కావచ్చు."

ఇంతలో అద్దంమీద, గదిలో కొన్ని చోట్లనుండి వేలి ముద్రలు తీసుకున్న పాధాలజిష్టు అక్కడకు వచ్చాడు.

"ఇవిగో సార్ వేలిముద్రలు" పాధాలజిష్టు అందించాడు.

"ఇవి ఈ ఇంట్లో ఎవరి ముద్రలయినా కావచ్చేమో అందరి వేలిముద్రలు తీసుకోవటం అవసరం" ఇనస్పెక్టర్ అన్నాడు.

పి. జె. నవ్వి "అయితే ఇది హత్య అంటారా?" ప్రశ్నించాడు.

"ఆలోచించాలి. మనం మొదట్లోనే వున్నాం."

పి. జె. మెట్లుదిగి ఆఖరుమెట్టు దగ్గర ఆగాడు. కాలిన దారం వుంది. మెల్లగా వంగి కాగితంలో కాలిన దారం బూడిదను వేసి పాట్లాంగట్టి జేబులో వేసుకున్నాడు. మెయిన్ డోర్ దగ్గరకు వచ్చాడు. గొళ్లెం పగలగొట్టి వుంది.

"ఇనస్పెక్టర్ ఈ గొళ్లెం మీరే పగలకొట్టారా?"

"అవును మేమే విరగగొట్టాం."

పి. జె. ఆ తలుపు ద్వారంచుట్టూ చూశాడు. తలుపు మడతలో చచ్చిన బల్లి వుంది. చీమలు పడుతున్నాయి.

"ఇనస్పెక్టర్ తలుపు తీశాక వేయటం జరిగిందా?"

"లేదు."

"ఈ బల్లి చూడండి. ఇది చచ్చి గంట అయివుండాలి."

"అయితే ఏమిటంటారు?"

"ఈ బల్లిని మార్చురీ చేయాలి. ఈ బల్లి ఇక్కడ చచ్చిందంటే తలుపు ఎవరో తీసి వేసివుండాలి. వేసినప్పుడు ఈ బల్లి తలుపు సందులో పడి చచ్చిపోయింది. ఆ తలుపు తీసిన టైము ఎంతయివుంటుంది? ఎవరు తీసి

వుంటారు? లోపల గడియ ఎలా పడింది? ప్రశ్నలు..." అంటూ చచ్చిన బల్లిని అద్దం ముక్క మీద వేసి "డాక్టర్ ఇది ఎంత సేపటి క్రితం చనిపోయి వుంటుంది?"

"శవం మార్చురీ శాగుంది. బల్లి మార్చురీ ఏమిటండి?"

"శవం ఎప్పుడు చచ్చింది కరెక్ట్‌గా చెప్పకపోయినా, బల్లి ఎప్పుడు చచ్చిందో చెప్పినట్లయితే ఈ కేసులో ఒక 'క్లూ' దొరికినట్లే."

డాక్టర్ బల్లిని పరీక్షగా చూసి "ఒక గంట క్రితం చనిపోయి వుంటుంది."

"థాంక్స్" అన్నాడు పి. జె. "మిస్టర్ పి. జె. నా కంతా అయోమయంగా వుంది. పైభాగంలో డోర్ తీసింది ఎవరు? ఈ తలుపు తీయటమేమిటి? ఈ రెండు ఇలా వుండగా ఇది హత్య? ఆత్మహత్య తేలకపోవటం? అంతా చిక్కు సమస్యలా వుంది" ఇనస్పెక్టర్ విజయ్ అన్నాడు

పి. జె. నవ్వాడు. "ఫస్ట్ డిగ్రీ మర్డర్ అయినపుడు. సమస్యలు ఇలాగే వుంటాయి. ఇందిరను పిలవండి."

"ఎందుకు?"

"ఈవేళ ఉదయం తలుపు ఎవరయినా తీశారేమో తెలుసుకోవాలి. అది ముఖ్యం."

ఇందిర వచ్చింది. ప్రక్కనే వాళ్ళమ్మ దుర్గ కూడా వుంది.

"నిన్నటినుండి నిడమానూరులోనే వున్నాం. లాంఛనాలు అయాక మధ్యాహ్నం బయలుదేరవచ్చుననుకున్నాం. రెండుసార్లు ఫోన్ చేస్తే ఎవరు పలకలేదు. మా అక్కయ్య స్ప్రయిన్ ఇంజరీ పేషంటు, ఎక్కడికీ వెళ్ళదు. తీరా యింటికి వచ్చాక తలుపు వేసేవుంది. అనుమానంమీద పోలీస్ రిపోర్టు యిచ్చాం" ఇందిర అంది.

"మీ యింట్లో ఎందరున్నారు?"

"నేను, మా అమ్మ, మా బావ, నౌకరు రామయ్య."

"మరి రామయ్య ఏడీ?"

"రామయ్య నమ్మకస్తుడు. చాలాకాలంనుండి యింటి వ్యవహారాలు చూస్తున్నాడు. ఇప్పుడు ఎక్కడకు వెళ్లాడో తెలియటంలేదు."

అప్పుడే రామయ్య ఆత్రతగా లోపలకు వచ్చాడు. "ఏమయింది? అమ్మగారు! ఆఁ ఏమిటిది? ఎవరు చేశారు? అమ్మగారు..." రోదించసాగాడు.

"నిన్నటినుండి ఎక్కడికెళ్ళావు?" ఇనస్పెక్టర్ కటువుగా అన్నాడు.

"దిక్కుమాలినవాడ్ని త్రాగి పడుకున్నాను. ఏమిటిది?"

"హత్య. నమ్మకస్తుడవని అప్పగించి వెళ్ళితే హత్య చేస్తావా?" ఇనస్పెక్టర్ హోదాలో అన్నాడు. రామయ్య తోకత్రొక్కిన త్రాచులా లేచాడు. ముఖం రంగు మారింది. "అయ్యాగారూ, కూటికి పేదనికాని నీతికి పేదను కాదండి. ఎంత డబ్బు కావలిస్తే అంత యిస్తారుగాని యిలాంటి బతుకు తక్కువపనులు చేస్తానా?" కోపంగా అన్నాడు.

పి. జె. రామయ్య భుజంపై చెయ్యివేశాడు, "చూడు రామయ్యా, నిన్నటినుండి నీవు రాలేదని అలా అన్నారు. ఎంత డబ్బు కావలిస్తే అంత వసుంధర నీకు ఎందుకిచ్చేది?"

రామయ్య అవాక్కు అయిపోయాడు.

బయట జీపు ఆగిన చప్పుడు, అందరి దృష్టి అటు మళ్ళింది.

చేతులను తాళ్ళతో కట్టిన రామకృష్ణను స్థానిక ఇనస్పెక్టర్ మెడపట్టి లోపలకు తోశాడు. క్రిమ్‌బ్రాంచి ఇన

స్పెక్టర్ విజయ్‌కు సెల్యూట్ చేసి, రామకృష్ణను చూపాడు. "సర్ ఇతను యీ నెక్లెస్ అమ్ముతుంటే అనుమానంమీద అరెస్టుచేసి, వివరాలడిగితే యీ యింట్లో దొంగతనం చేశానని చెప్పాడు." విజయ్, రామకృష్ణ కళ్ళలోనికి చూశాడు.

పాధాలజిస్టు వేలిముద్రలు పరీక్షించి "ఆ గదిలో పై భాగంలో దొరికిన వేలిముద్రలు, రామకృష్ణ వేలిముద్రలు ఒక్కటే" అన్నాడు.

"అరెస్టు చెయ్యండి" అన్నాడు గంభీరంగా.

"నాకేం తెలీదు. నేనీ నేరం చేయలేదు" అరుస్తున్నాడు రామకృష్ణ. పి. జె. ఆలోచిస్తూ నిలుచుండిపోయాడు. కొన్నిక్షణాలు తరువాత పి. జె. అడిగాడు. "ఇనస్పెక్టర్ మీకు అభ్యంతరం లేకపోతే రామకృష్ణను నాలుగుమాట లడగవచ్చా?"

"వై నాట్. అడగండి" అన్నాడు ఇనస్పెక్టర్ విజయ్.

పి. జె. రామకృష్ణ భుజంమీద చేయివేసి ప్రక్క గదిలోనికి తీసుకువెళ్ళాడు. "నీ పేరు" అడిగాడు.

"రామకృష్ణ."

"నన్ను డిటెక్టివ్ పి. జె. అంటారు" తనను పరిచయం చేసుకున్నాడు. రామకృష్ణ గభాలున కాళ్ళు పట్టుకున్నాడు. "మీ గురించి నాకు తెలుసు. కాని నేను హంతకుడ్ని కాదు. నేను చంపలేదు. ఉద్యోగం కొరకు తిరిగి తిరిగి వేసారి దొంగతనం చేయటానికి దిగాను" కళ్ళలో ధారలుగా నీళ్ళు కారుతున్నాయి."

"నీవు యీ యింట్లో దొంగతనానికి ఎన్ని గంటలకు వచ్చావ్?"

"మధ్యరాత్రి షుమారు పన్నెండవుతుంది. ఇంట్లో అలికిడి లేదని జామచెట్టుమీదుగా లోపలకు ప్రవేశించాను. అగ్గిపుల్ల గీచాను. ఆ వెలుగులో శవం. అది జ్ఞాపకంవస్తే యిప్పటికి భయమేస్తుంది."

పి. జె. ఆలోచించాడు. అతను హత్య చేయటానికి బలమయిన కారణం ఏం లేదు. కాని విట్నెసులు అతన్ని నిందితుడ్ని చేశాయి. విధి వంచితుడు అనుకున్నాడు. "చూడు రామకృష్ణా! నీవు నిజంగా హత్య చేయకపోతే కాయశక్తులా నిన్ను కాపాడతాను. అధైర్యపడక" అంటూ భుజం తట్టాడు.

అంతలో బయట టాక్సీ ఆగింది. టాక్సీలోనుండి మధురాధర్ దిగాడు. "ఏమిటి? ఏమయింది?" ఆతృతగా అడిగాడు.

"ఐయామ్ సారి, మీ భార్య వసుంధర హత్య చేయబడింది."

"హత్య, నా భార్య హత్య చేయబడిందా? అబద్ధం నా భార్య దేవతలాంటిది. ఆమెను ఏ రాక్షసుడు చంపాడు. వసుంధర, నా వసు" బిగ్గరగా ఏడ్చాడు. కొన్నిక్షణాలు అందరు నిశ్శబ్దంగా వున్నారు. ఇనస్పెక్టర్ విజయ్ భుజం తట్టాడు.

"ఎప్పుడు జరిగింది యీ హత్య?"

"నిన్న రాత్రి జరిగింది. మేము ఇప్పుడే తెలుసుకున్నాం. హంతకుడ్ని కూడా పట్టుకున్నాం. ఇతనే."

మధురాధర్ క్రౌర్యంగా చూశాడు. అక్కడ ఎవరూ లేకుండా రామకృష్ణ ఒక్కడే వున్నట్లయితే అతన్ని ముక్కలు చేసేవాడు. కాని, ఎందరో వుండటంవల్ల ఏమీ అనలేక చూపులతో తినివేశాడు.

కొన్ని నిమిషాల తరువాత రామకృష్ణతో పోలీస్ సిబ్బంది వెళ్ళిపోయారు.

3

కోర్టు గడియారం పదిగంటలు కొట్టింది. న్యాయమూర్తి హరిశ్చంద్రరావు న్యాయసింహాసనం అధిష్టించాడు. ప్రాసిక్యూషన్ కేసు ప్రారంభించేటందుకు సిద్ధమవుతున్నారు.

డాక్‌లో ముద్దాయి రామకృష్ణ, ప్రేక్షకులలో ఇందిర, ఆమె తల్లి, మధురాధర్, రామకృష్ణ చెల్లెలు వాసవి వున్నారు.

"యువర్ ఆనర్! ది జంటిల్‌మన్ ఆఫ్ ద జ్యూరి! పరిస్థితుల ప్రాబల్యంవల్ల నేరాలు చేయటం సహజం, అయితే ఇది నేరంకాదు. దానికంటె బలమయింది, హృదయవిదారకమయింది. వసుంధర, కాళ్ళు వుండి నడవ లేని అమ్మాయి ఐమీన్ ఇంజరీ పేషెంటు. ఆమెను నిర్దయగా డాక్‌లో నిలబడ్డ ముద్దాయి రామకృష్ణ చంపాడని ప్రాసిక్యూషన్ చెపుతుంది. ఇతనే ఈ హత్యచేశాడని ఎన్నతగిన ఋజువులు, సాక్ష్యాలు ప్రాసిక్యూషన్ ప్రవేశ పెడుతుంది కాబట్టి కోర్టువారు అనుమతించవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాం."

"మిస్టర్ రామకృష్ణ నీ తరఫున వాదించటానికి లాయ రెవరయినా వున్నారా?" న్యాయమూర్తి అడిగాడు. రామకృష్ణ విషాదంగా నవ్వాడు. "కూటికే గతిలేని నాకు లాయరు ఎలా వస్తాడు న్యాయమూర్తిగారు."

"ఐ మె బి పర్మిటెడ్ టు డిఫెండ్ ద ఎక్యూస్డ్ యువర్ ఆనర్" ప్రఖ్యాత డిటెక్టివ్ లాయరు పి. జె. గొంతు ఖంగుమని వినిపించటంతో అందరి దృష్టి అటు

మళ్ళింది. ముఖాలు ఆశ్చర్యంతో రంగుమారాయి. రామ కృష్ణ కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి.

"ప్రాసిక్యూషన్ వారు కేసు ప్రారంభించవచ్చు" న్యాయమూర్తి అన్నాడు.

పి. పి. గొంతు సవరించుకొని "ఇది అన్ని కేసులలా సామాన్యమయింది. రామకృష్ణ ఒక దొంగ, అని తనే అంగీకరించాడు. నవంబరు 21వ తేది రాత్రి ఇతను ఆ ఇంట్లో వెనుకభాగంనుండి ప్రవేశించి నెక్లెస్, కొన్ని చీరెలు దొంగిలించాడు. అది వసుంధర చూసిందా? లేక మరేదయినా కారణం వుందా అన్నది నిర్వివాదాంశం. రివాల్వర్ తో చంపటం ఖాయం. అయితే రివాల్వర్ మీద తన వేలిముద్రలు పడకుండా తుడిచి ఆత్మహత్య అనుకోవ డానికి వీలుగా అది హతురాలి చేతిలో వుంచాడు.

వాటిజ్ మోటివ్ ఆఫ్ ద మర్డర్. బహుశా మర్డర్ ఇంటెన్షన్ తో రామకృష్ణ వెళ్ళి వుండకపోవచ్చు. వసుంధర బెదిరించటమో, లేక ముద్దాయిని చూడటమో జరిగింది కాబట్టి హత్యచేశాడు. సో ఈ కేసు దర్యాప్తు చేసిన విజయ్ ని కోర్టువారి అనుమతితో పిలుస్తున్నాను," అన్నాడు గాగుల్సు తుడుచుకుంటూ.

ఇనస్పెక్టర్ విజయ్ విట్నెస్ బాక్స్ లో నిలబడి ఉద్యోగార్హతల్ని తెలియచేసి ప్రమాణం స్వీకరించాడు. "ఇనస్పెక్టర్ విజయ్ నవంబరు 21వ తేది వసుంధర అనే అమ్మాయి హత్యచేయబడిందని కంట్రోల్ నుండి మీకు ఫోను వచ్చాక మీరేం చేశారు? రామకృష్ణను ఎలా అరెస్టు చేశారు?"

"కంట్రోల్ నుండి ఫోను వచ్చాక హత్య జరిగిన

ఇంటికి వెళ్ళాం. అయితే ఆ ఇంట్లో హత్య జరిగింది అని ముందే తెలిసింది. ఇందిర అనే వసుంధర చెల్లెలు అనుమానం మీద రిపోర్టు యివ్వటంతో తలుపు బద్దలకొట్టాం. లోపల వసుంధర శవం వుంది. నుదురులో బుల్లెట్ దిగి తల పగిలి చనిపోయింది. తలలో .38 కాలిబర్ బుల్లెట్ వుంది. అది ఎక్సిబిట్ 'ఏ'గా ప్రవేశపెట్టాం."

"ఇది హంతకుడు వెంట తెచ్చాడా? అది ఎవరిది?"

"అది ఆ యింట్లోనే వసుంధర భర్త మధురాధర్ రివాల్వర్. ఈ రివాల్వర్‌తో వసుంధర బెదిరించి వుండాలి. రామకృష్ణ యుక్తిగా ఆ రివాల్వర్ చేత చిక్కించుకుని హత్య చేశాడు."

"అప్పుడు టైము ఎంతయి వుంటుంది."

"షుమారు సాయంకాలం 5 నుండి రాత్రి 8 గం||ల లోపు ఈ హత్య జరిగివుండాలి. మరొక విషయం హతురాలి చేతికి పగిలివున్న వాచినిబట్టి 5-35 నిమిషాలకు ఈ హత్య జరిగివుండవచ్చు. అది ఎక్సిబిట్ 'డి'గా ప్రవేశపెట్టాం."

"హంతకుడి ఉద్దేశం ఏమిటి?"

"దొంగతనం. రామకృష్ణ ఆ యింట్లో దొంగతనం చేయాలని జామచెట్టు మీదుగా బాల్కనీలోనికి ఎక్కి లోపల ప్రవేశించాడు. అతడు దొంగిలించిన నెక్లెస్, చీరెలు అమ్మకానికి ప్రయత్నిస్తుండగా అరెష్టు చేశాం. అవి ఎక్సిబిట్ 'బి', 'సి' లుగా ప్రవేశపెట్టాం."

"అవి యివేనా?"

"యస్. ఇవే అని వీటిపై గుర్తులు పెట్టాను."

"ఆ యింట్లో మరెవరయినా వున్నారా?"

"లేరు. ఇందిర తల్లితో కలిసి నిడమానూరు పెళ్ళికి వెళ్ళింది. మధురాధర్ క్రొత్త సినిమా తీయటం కోసం మద్రాసు వెళ్ళాడు. నౌకరు తాగా త్రాగి నిద్రపోయాడు. అందుకే వసుంధర ఆ యింట్లో ఒకర్తె వుంది. ఆ విషయం హంతకుడికి తెలిసివుండాలి."

"క్రాసు చేసుకోవచ్చు" అన్నాడు పి. పి. లాయరు.

పి. జె. లేచి గొంతు సవరించుకొని విజయ్ ముఖంలోనికి చూసి పలకరింపుగా నవ్వాడు.

"హత్య ఎన్నిగంటలకు జరిగిందన్నారు."

"ఐదు - ఎనిమిది గంటల మధ్య."

"రామకృష్ణ ఎన్నిగంటలకు లోపలకు వెళ్ళివుండాలి."

"షుమారు ఐదుగంటలు కావచ్చు."

"మీరు ఎన్నో చోరీకేసులు దర్యాప్తు చేశారు కదా. చోరీ సహజంగా ఎప్పుడు జరుగుతూ వుంటుంది."

"రాత్రి సమయంలో."

"మరి రామకృష్ణ పగలు దొంగతనం చేశాడనటం సమంజసమా?"

"అబజక్షన్ యువర్ ఆనర్! దొంగతనం పూర్వకాలంలో రాత్రులు జరిగేది. ఇప్పుడు పట్టపగలు పదిమంది మధ్య జరుగుతూంది. రామకృష్ణ ఉద్దేశాన్ని సాక్షిని చెప్పమనటం హాస్యాస్పదం."

"అభ్యంతరం అంగీకరిస్తున్నాను."

పి. జె. సన్నగా నవ్వాడు. "అయితే ముద్దాయి పగలే లోపల ప్రవేశించాడంటున్నారు. అయితే పైభాగంలో కాలిన అగ్గిపుల్లలు మూడు కనిపించాయి, వాటిని ముద్దాయి ఎప్పుడు గీసి వుండాలి."

"అదే రాత్రి గీసి వుండాలి."

"గుడ్. ఆ అవసరం ఏమిటో చెప్పగలరా? మిస్టర్ ఇనస్పెక్టర్ ముద్దాయి పగలు ప్రవేశించాడంటున్నారు. పగలు అగ్గిపుల్ల గీయవలసిన అవసరం ముద్దాయికి లేదు. ఇంట్లో వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయి. మరో విషయం ముద్దాయికి వసుంధర ఒకర్తె యింట్లో వుందని తెలుసు. అలాంటప్పుడు తలుపు తట్టి ఏదో నెపంమీద లోపలకి ప్రవేశించవచ్చు. బాల్కనీలో నుండి ఎక్కవలసిన అవసరం ఏమిటి? ఇలా ఎక్కినప్పుడు వసుంధర చూడ టానికి అవకాశం వుంది. ఏమంటారు?"

"నేను 5-8 లోపు అన్నాను కాస్త ప్రొద్దుపోయాక వుండవచ్చు."

"గుడ్ అలాంటప్పుడు వసుంధర యింట్లో లైట్లు వెలిగాయా?"

"లేదు. వెలగ లేదు."

"దీపాలు వెలగలేదంటే, వసుంధర వెలిగించలేదన్న మాట, వెలిగించలేదంటే వసుంధర అప్పటికే చచ్చి పోయింది. దీనినిబట్టి హత్య జరిగింది పగలు అని నిర్ణ యించాలి."

ప్రాసిక్యూటర్ గబాలున లేచి "ఇనస్పెక్టర్ ఐదు గంటలకు వచ్చిన మనిషి, ఎనిమిది గంటలవరకు యింట్లోనే ఉండివుండొచ్చు కదా! తను యింట్లోనుండి బయటకు వెళ్ళేటందుకు అవకాశం లేక, లేదా మరెవరయినా చూస్తారేమోనన్న భయంతో ఆగి వుండచ్చు కదా!"

"ఆఁ అలా జరిగి ఉండవచ్చు."

"అంటె మూడుగంటలు ఆ ఇంట్లోనే ఉండి, చీకటిలో కూడా బయటకు వెళ్ళలేని ముద్దాయి అన్నమాట."

"అవును."

"అలాంటి వ్యక్తి పగలు ఎలా రాగలిగి వుంటాడు."

ఇనస్పెక్టర్ తటపటాయించాడు. "హత్య జరిగాక అభిప్రాయం మారివుండొచ్చు."

"హంతకుడు ఎన్నిగంటలకు లోపలకు వెళ్ళాడని చెప్పాడు."

"పదకొండు గంటలయిన తరువాత. అది యథార్థం కాదు ఒకరకమయిన కట్టు కథ" ఇనస్పెక్టర్ కోపంగా అన్నాడు. "గదిలో అన్నిచోట్ల వేలిముద్రలు స్వీకరించారు కదా!" పి. జె. ప్రశ్న.

"అవును."

"పైభాగంలో క్రిందభాగంలో ముద్దాయి వేలిముద్రలున్నాయా?"

"పైభాగంలో ఉన్నాయి. క్రిందభాగంలో లేవు. కాని అతడు వెలిగించిన అగ్గిపుల్ల ఉంది. అంటె క్రింద భాగంలో వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడ్డాడు అని చెప్పవచ్చు."

"గుడ్. ఆ యింట్లో రివాల్వర్ ఎక్కడుంది?"

"మధురాధర్ గదిలో సొరుగులో ఉండేదట."

"ఆ గది పైభాగంలో ఉంది కదూ!"

"అవును."

"పైభాగంలో ఉన్న రివాల్వర్ వసుంధర తీసుకుందా? లేక ముద్దాయి తీసుకొని వుండాలా?" పి. జె. ప్రశ్న.

"సారీ చెప్పలేను."

"ఏది ఏమయినా వసుంధర దగ్గరలో ఉండే అవకాశం లేదు. కాబట్టి, ముద్దాయి రివాల్వర్ తీసుకువచ్చి ఉండాలి."

"అవును."

"ఎక్కడనుండి?" పి. జె. ప్రశ్న.

"అడగలేదు. అడిగినా చెపుతాడనే నమ్మకంలేదు కాబట్టి అడగలేదు."

"అందుకే రివాల్వర్ పూర్వాపరాలు దర్యాప్తు చెయ్యలేదు."

ఇనస్పెక్టర్ మౌనంగా వున్నాడు.

"చివరసారిగా ఒక ప్రశ్న. రివాల్వర్ కాల్చటానికి గురి అవసరమా?" పి. జె. కు తెలిసి ప్రశ్న అడిగినందుకు చిరాకు కలిగింది.

"అవసరమే."

"ఎవరయినా రివాల్వర్ ఎదురు ఉంచి కాల్చబోతుంటే ఏంచేస్తారు?"

"పారిపోతారు. లేదా అరుస్తారు."

"గుడ్ వసుంధర దగ్గరనుండి రామకృష్ణ మాయోపాయంగా రివాల్వర్ కాజేశాడనుకుందాం. ఆ రివాల్వర్‌తో వసుంధరను కాల్చ ప్రయత్నించాడు. అప్పుడు వసుంధర వీలింగ్ చైర్‌తో పారిపోతుంది. తప్పించుకోటానికి ప్రయత్నిస్తుంది. కాని కాల్చు అన్నట్లు ముద్దాయికి ఎదురుగా ఉండదు కద."

పి. పి. చివాలున లేచి "పారిపోయే అక్కడ ఆగి ఉండొచ్చు."

"హత్య జరిగింది హాలు మధ్య. వసుంధర పారిపోటాని ప్రక్కనే గది ఉంది. పోతే ముద్దాయి రివాల్వర్ కాల్చేటప్పుడు వసుంధర ఎదురుగా ఉండటానికి అవకాశంలేదు. పోని దూరంనుండి కాల్చాడా? అంటె అంత గురి ముద్దాయికి ఉందా అన్నది ప్రశ్న. చెప్పండి ఎలా కాల్చి ఉంటాడు?"

"రివాల్వర్‌తో కాల్చి ఉంటాడు. అంతకంటె చెప్ప లేను" విసుగ్గా అన్నాడు.

పి. జె. నవ్వి "దట్సాల్ యువర్ ఆనర్," అన్నాడు.

ప్రాసిక్యూషన్ తరువాత సాక్షిగా పాథాలజిష్టు విట్నెస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం స్వీకరించాడు. వసుంధర హత్య చేయబడి గదిలో వేలిముద్రలు పరీక్షించా నని, అవి రామకృష్ణ వేలిముద్రలని, హతురాలి శవం తలలో కాలిబర్ బుల్లెట్ పేల్చబడిందని, అది .38 అని, అది ఆమె చేతిలోనున్న రివాల్వర్ నుండి కాల్చబడిందని, వివరించి చెప్పాడు.

"క్రాసు చేసుకోవచ్చు."

పి. జె. నిలబడి పాథాలజిష్టు దగ్గరకు నడిచాడు. "చూడండి. రివాల్వర్ పేలిన శబ్దం ఎంతదూరం వినిపించ వచ్చు."

"అది ప్రాంతాన్ని బట్టి, గది వైశాల్యాన్ని బట్టి ఉంటుంది. ఆ ఇంట్లో ఓ వందగజాల దూరం వినిపించే అవకాశం ఉంది."

"రివాల్వర్ కాల్చిన మనిషి గురి తెలిసినవాడయి వుండాలా?"

"అవును. మరి ఐదు, ఆరు అడుగులదూరంలో తప్ప దూరంనుండి కాల్చినప్పుడు గురి తప్పక అవసరం."

"నో క్వశ్చన్ యువర్ ఆనర్" అన్నాడు పి. జె.

ప్రాసిక్యూషన్ తరువాత సాక్షిగా శవాన్ని మార్చురి చేసిన డాక్టర్ విట్నెస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం స్వీకరించి, ఉద్యోగార్హతల్ని తెలియచేశాడు. "డాక్టర్ వసుంధర శవాన్ని పరీక్షించారు కదా వివరాలు తెలియ చేయగలరా?"

"వసుంధర అనే అమ్మాయి తలలో రివాల్వర్ బుల్లెట్ ఉంది. అంటె రివాల్వర్ గుండు దెబ్బ తగలటంతోనే ప్రాణంపోయి ఉండాలి. పుర్రె చిట్లి మెదడులో దూరి పోయింది. ఆమె అరవటానికి అవకాశం లేదు."

"డాక్టర్! ఆమె స్పయిన్ ఇంజరీ పేషెంటా?"

"అవును. ఆమె స్పీనల్ కార్డ్ దెబ్బతింది. అందుకే నడవలేదు."

"మీరు శవాన్ని చూసినపుడు శవం ఎలా ఉంది?"

"వీలింగ్ చైర్ నుండి క్రిందపడి ఉంది. అంటె రివాల్వర్ దెబ్బకు మనిషి పూర్తిగా ప్రక్కకు వాలిపోయినపుడు కుర్చీ ప్రక్కకు పడిపోయి ఉండాలి. అంతకు తప్ప వివరాలు తెలియవు."

"క్రాసు చేసుకోవచ్చు" పి. జె. లేచి డాక్టర్ దగ్గరకు నడిచి డాక్టర్ని చూస్తూ, "డాక్టర్! ఆమె పేషంటు హత్యకు ముందు ఆమె భోజనం తీసుకొని వుంటుందా?"

"లేదు బిస్కెట్స్, టి తీసుకుంది. అప్పుడు సమయం 4 గంటలు అయివుండవచ్చు."

"దీనినిబట్టి ఆమె హత్య ఐదు, ఆరు మధ్య జరగటానికి అవకాశం ఏమయినా ఉందా?"

"అలాగే జరిగి ఉండాలి."

"రివాల్వర్ దగ్గరనుండి కాల్చి ఉంటాడా? దూరం నుండి కాల్చాడా?"

"తగిలిన గాయాన్నిబట్టి దగ్గరనుండే కాల్చాడు."

"కాల్చిన తరువాత రివాల్వింగ్ చైర్ లోనుండి హతురాలు క్రింద పడిపోటానికి అవకాశం వుందా?"

"అంటే హతురాలు కాస్త బలంగల మనిషి కాబట్టి

పూర్తిగా ఒక ప్రక్కకు ఒరిగిపోతే క్రింద పడిపోయే అవకాశం ఉంది, అది హతురాలు ప్రాణం పోయినపుడే జరిగి ఉండాలి.''

''చివరసారిగా ఆమెను ముద్దాయి బలాత్కరించినట్లు, లేదా కలయబడ్డట్లు సూచనలేమయినా ఉన్నాయా?''

''లేవు. అలాంటి ప్రయత్నాలుకూడా జరగలేదు.''

''దట్సాల్ యువర్ ఆనర్.''

కేసు మరునాటికి వాయిదా పడింది.

4

మధురాధర్ ఒంటరిగా కూర్చుని ఒక్కొక్క పెగ్ బ్రాంది త్రాగుతూ చిప్స్ చప్పరిస్తున్నాడు. అంతలో టాక్సి దిగి దగ్గరకు వచ్చాడు పి. జె.

''హల్లో! మీ వాదన వింటుంటే విస్తుపోయాను. హంతకుల్నికూడా నిర్దోషులుగా నిరూపించే శక్తి, సామర్థ్యాలు మీకున్నాయి.''

పి. జె. నవ్వాడు. ''ఉన్నా అలాంటి పని భారతదేశంలో పుట్టిన నీతిమంతుడయిన మానవుడు చేయడు. మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను. కాని...'' సందేహించాడు. ''ఫరవాలేదు మిస్టర్ పి. జె. త్రాగినంత మాత్రంలో తారుమారుగా సమాధానం చెప్పను.''

మధురాధర్‌కు ముప్పైఐదేళ్ళు వుంటాయి. అందంగా, హుందాగా వున్న యువకుడు. విలాసపురుషుడు, ఆగర్భ శ్రీమంతుడు కాకపోయినా నడమంత్రపు సిరితో వెలిగిపోతున్న మనిషి. అతని అందం చూసే వసుంధర ప్రేమించి పెళ్ళి చేసుకుంది అనుకున్నాడు.

''మీరు మద్రాసు ఎప్పుడు వెళ్ళారు?''

"నవంబరు 20 తేది రాత్రి మెయిల్‌కు వెళ్ళాను. తిరిగి 22 తేది ఉదయం 8-30 గంటలకు సర్కార్‌లో వచ్చేశాను. అప్పటికే యిల్లంతా కోలాహలంగా వుంది.',

"మీరు మద్రాసులో ఎక్కడ వున్నారు?"

"ఎలిబికోసమా? డిఫెన్స్ విట్నెసులు దొరకలేదేమో" హేళనగా నవ్వి "స్వరూప్ హోటల్ రూం నెంబరు 36. పోతే ఆ రోజు రాత్రి 5 గంటలకు మా సంస్థ టెక్నీషియన్లకు పార్టీ చేశాను. పార్టీ ముగిసేసరికి 9 గంటలయింది. ఆ తరువాత సర్కార్‌లో బయలుదేరాను."

"మీరు వెళ్ళేముందు మీకు, మీ భార్యకు అభిప్రాయ భేదాలు ఏమన్నా వున్నాయా?"

"అవును. వెళ్ళేముందు నిడమానూరు పెళ్ళికి వెళ్దామంది. కాని నేను అంగీకరించలేదు. గోరంతను కొండంతగా చేసి మాట్లాడింది. అయినా ఆ మాటలు లక్ష్య పెట్టుకోకుండా వెళ్ళిపోయాను."

"మీరు అంత అర్జంటుగా మద్రాసు వెళ్ళిన కారణం?"

"పెళ్ళికి వెళ్ళకూడదనే అభిప్రాయంతోనే. దానికి కారణం చెప్పమంటారా? నో అది మా కుటుంబ విషయం" సిగరెట్టు వెలిగించి ఒకటి పి. జె. కి అందించాడు. "నో. థాంక్స్." క్షణం ఆగి "మీ యింట్లో నౌకరు రామయ్య ఎలాంటివాడో తెలుసా?"

"తెలుసు. వాడికి త్రాగుడొకటి తప్ప, అన్నీ మంచి లక్షణాలే. అందుకే వాడిని నౌకరుగా యిన్నాళ్ళు వుంచగలిగాము."

పి. జె. ఆలోచించాడు. "ఓ. కె. వస్తాను. అన్నట్లు ఇందిర ఎక్కడ వుంది?" అడిగాడు.

"బహుశా పైన చదువుకుంటుందేమో."

గదిలో ఇందిర ఒంటరిగా కూర్చొని వసుంధర ఫోటోను చూస్తూ ఆలోచిస్తూంది. పి. జె. ను చూశాక "మీరా... రండి" అంది. పి. జె. కూర్చున్నాడు.

"ఒక ముఖ్యమయిన విషయం నీవు చెప్పాలి?"

"ఏమిటది? అడగండి."

"హంతకుడు రామకృష్ణ కాకపోతే మరెవరో కావాలి. ఆ అవకాశం మీ నలుగురికే వుంది. ఆ నలుగురు మధురాధర్, నీవు, మీ అమ్మ, నౌకరు రామయ్య. మీ అమ్మ పెళ్ళిలోనే వున్నట్లు నీకు తెలుసా?"

"ముహూర్తం రాత్రి 8-40 నిమిషాలకు. సాయంకాలం 4 గంటలనుండి మా అమ్మ దుర్గ కనిపించలేదు. ఎక్కడకు వెళ్ళిందో కూడా తెలీదు. నేను అడగలేదు."

"మీ అమ్మ వసుంధరపై ప్రేమగా వుంటుందా?"

"నాకా నమ్మకంలేదు. ప్రేమగా వున్నట్లు నటిస్తుంది."

పి. జె. నిట్టూర్చాడు. నౌకరు రామయ్య గురించి మీ అభిప్రాయం."

"వాడొక త్రాగుబోతు. అయినా మా యింట్లో ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నమ్మకమయిన మనిషి."

"మీ అమ్మగారు ఎక్కడ వుంది?"

"గార్డెన్‌లో వుంది" అంది. పి. జె. ఆమె దగ్గరనుండి బయలుదేరి గార్డెన్‌లోనికి వెళ్ళాడు. దుర్గ ఒంటరిగా కూర్చొని భగవద్గీత చదువుతూంది. పి. జె. ను చూసి నమస్కరించింది.

"మీరు అనవసరంగా శ్రమ పడుతున్నారు. రామకృష్ణ హంతకుడు."

పి. జె. నవ్వాడు. "మీరు చూశారా?"

...లాలం మనిషిని నిందితుడ్ని
...తిది.''
...మీరు వచ్చినపని?''
...రాత్రి, అంటే వసుంధర హత్య
...ండి 8 గంటలవరకు మీరు ఎక్క-
...సూటిగా చూస్తూ అడిగాడు.
...''మీరు అనేదేమిటో అర్థం
...లేదు.''
...డికన్నదే ప్రశ్న?''
...ంది. ''నాకేం తెలీదు. తెలిసినా
...ప్రశ్నలకు సమాధానం చెప్ప.
...గబగబా వెళ్ళిపోయింది.
...లిగించాడు.

...నే చూశాడు. ఎదురుగా
...వున్నాడు. ''ఎంత సేపయింది

...రామయ్య లేనపుడు యింట్లోకి
...వెళ్ళింది. రామయ్య ఇంట్లో
...వున్నాయి. విశేషమేమంటే
...ంది కొద్దిగా వుంది.''

...ట్రంక్ బాక్స్‌లో రెండు వంద
...రూపాయల నోట్లు వున్నాయి.
...డండి. ఇది అతని పెట్టెలోనే

ఫోటో చూశాడు. అది న్యూడ్ ఫోటో. నిశితంగా చూస్తే తప్ప ఆకారం పోల్చలేము. అది ఇందిర ఫోటో.

పి. జె. సిగరెట్ వెలిగించాడు. ఫోటో నే చూస్తూ అన్నాడు. "ఇది ఇందిరకు తెలియకుండా తీసిన ఫోటో. తెలుస్తూనే వుంది. ఇది మినియేచర్ కెమెరాతో తీసింది."

"అవును, రామయ్యకు ఎలా వచ్చింది?"

"ఏది ఏమయినా మిస్టర్ ధర్మ. ప్రతి మనిషికి ఎలిబీ వుంది. వీళ్లు ఎలిబీలు సృష్టించుకున్నారా? లేక వాస్తవమా అన్నది పరిశోధించాలి."

"అలాగే సర్."

"మద్రాసు హోటల్ స్వరూప్‌లో మధురాధర్ వుండటం, దుర్గ పెళ్ళికి వెళ్ళి 5 గంటలనుండి 8 గంటల వరకు ఎక్కడికి వెళ్ళింది. ఇందిర ఎక్కడ వుంది? రామయ్య పూర్వాపరాలేమిటి నిశితంగా ఆలోచించాలి. డిఫెన్స్‌లో ప్రత్యేకమయిన సాక్ష్యాలు మనకు లేవు. సాధ్యమైనంత తొందరలో యీ విషయాలు పరిశోధించాలి."

"ఓ. కె. సర్" అసిస్టెంట్ ధర్మ అన్నాడు. "ఇప్పుడే మద్రాసు బయలుదేరుతాను" అన్నాడు.

మర్నాడు సాయంత్రం ధర్మ మద్రాసునుండి ఫోన్ చేసి చెప్పాడు. హత్య జరిగిన రోజంతా మధురాధర్ మద్రాసులోనే వున్నట్లు గట్టి ఎలిబీ వుందని, పైగా హత్యాసమయంలో ఒక పార్టీలో ఎందరో ప్రముఖుల మధ్యన వున్నాడని చెప్పాడు ధర్మ. పి. జె. ఏవో మరి కొన్ని ఆదేశాలిచ్చి ఫోన్ పెట్టేశాడు.

6

ప్రాసిక్యూషన్ తరువాత సాక్షిగా మధురాధర్ విట్నెస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం చేశాడు. "మిస్టర్ మధురా

ధర్ మీరు మీ భార్యను ఎప్పుడు చూశారు?"

"నవంబరు 20 తేది మద్రాసు వెళ్ళేముందు చూశాను" అన్నాడు మధురాధర్.

"మీ యిద్దరికి మనస్పర్థలున్నాయా?"

"ఉన్నాయి. కాని అవి సహజం. ఆత్మహత్యకు దారి తీసేటంత విచిత్రమయినవి కావు. చాలా కుటుంబాలలో సామాన్యంగా వుండేవి."

"ఈ పిస్తోలు చూడండి. ఇది ఎవరిది?"

"నాదే. అక్టోబరు 16 తేదీన నా చేతికి రావటం జరిగింది."

"ఈ పిస్తోలు మీ యింట్లో ఎక్కడ వుంటుంది?"

"పై భాగంలో నా గదిలో వుంటుంది."

"క్రాసు చేసుకోవచ్చు" పి. పి. అన్నాడు.

పి. జె. లేచి "మిస్టర్ మధురాధర్ మీకు శత్రువులున్నారా?"

"లేరు."

"మరి మీకు రివాల్వర్ అవసరం ఏమిటి?"

"ఆదో సరదా!"

"మిస్టర్ మధురాధర్! మీ ఆస్తి యావత్తు వసుంధర పేర ఉంది. మీ దగ్గర డబ్బు వుండదు. మీకు శత్రువులు లేరు. పిట్టలు కొట్టటానికి గన్స్ అందుబాటులో వుండగా రివాల్వర్ ఎందుకు తెప్పించారు?"

"అబ్జక్షన్ యువర్ ఆనర్! సాక్షికి రివాల్వర్ అవసరం ఏమిటి? ఎందుకు? అన్నది ప్రశ్న కాదు. వసుంధర కోరి ఉండొచ్చు."

"నో యువర్ ఆనర్! వసుంధర, రివాల్వర్ వద్దనటం దానివల్ల యింట్లో వాగ్వాదం జరగటంకూడా జరిగింది.

కాబట్టి ఎలాంటి దృక్పథంతో రివాల్వర్ తెప్పించాడన్నది ప్రశ్న?"

"చెప్పండి, మిస్టర్ మధురాధర్?" జడ్జి ప్రశ్న.

"ఆత్మరక్షణార్థం తెప్పించాను. మా బంగళా ఊరుకు చివరలో వుంది. దొంగల, హంతకుల బారినుండి రక్షించు కొనేందుకు వీలుగా ఉంటుందని తీసుకున్నాను."

న్యాయమూర్తి వ్రాసుకున్నాడు. "ఈ రామకృష్ణను మీరు యిదివరలో యెప్పుడయినా, యెక్కడయినా చూశారా?"

"లేదు."

"దట్సాల్ యువర్ ఆనర్!" అన్నాడు పి. జె.

ప్రాసిక్యూషన్ తరువాత సాక్షిగా ఇందిర విట్నెస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం చేసింది.

"చూడమ్మా, మీ యింట్లో హత్య జరిగింది. హత్యకు ముందు మీ అక్క వసుంధరను ఎప్పుడు చూశావు?"

"పెళ్ళికి వెళ్ళేముందు నవంబరు 21 ఉదయం తొమ్మిది గంటలకు మా అక్క సాగనంపింది."

"మీ అమ్మ, నీవు యిద్దరు వెళ్ళారా?"

"అవును."

"తిరిగి యెప్పుడు వచ్చారు?"

"నవంబరు 22 తేది ఉదయం వచ్చాం. మా అక్క ఎంతకూ తలుపు తీయకపోవటంతో రిపోర్టు యిచ్చాం."

"క్రాసు చేసుకోవచ్చు" పి. పి. అనటంతో పి. జె. నిలబడి ఇందిరను "చూడమ్మా, మీ అక్క తలుపు తియ్యలేదు. కారణం నీకు తెలీదు. కాని నీవు హత్య జరిగిందని ఫోన్ చేశావు? అది యెలా ఊహించావు?"

"దానికి కారణాలు రెండు. ఒకటి పెళ్ళికి ముందు మా అమ్మకు, అక్కకు డబ్బు విషయంలో సంఘర్షణ జరగటం, మా అమ్మవల్ల మా అక్క మనసు చికాకుపడటం జరిగింది."

"సంఘర్షణ అంటే యెలాంటిది?"

"పెళ్ళి ఖర్చుల నిమిత్తం మా అమ్మ రెండువేలు కావాలంది. అంతేకాకుండా మా అమ్మ అవి, ఇవి అని చాలా డబ్బు వాడటం జరిగింది. ఆ దృష్ట్యా అక్క డబ్బు ఇవ్వనంది. దానితో యిద్దరిమధ్య ఘర్షణ జరిగి, మా అమ్మ చనిపోయిన మా నాన్నను తిట్టిపోసింది."

"ఎందుకు?"

"ఆస్తి యావత్తూ వసుంధర పేర పెట్టినందుకు."

"రెండో కారణం ఏమిటి?"

"మా బావకు, మా అక్కకు భేదాభిప్రాయాలు చాలా వున్నాయి.మా అక్కయ్య బావ ఎవరెవరితోనో సంబంధం పెట్టుకున్నాడని బాధ పడుతుంది. అంతేకాకుండా బావ డబ్బుకావాలి అని ప్రతిసారి అడగటంతో మనసు వికలమై ఆత్మహత్య చేసుకుందేమో అనుకున్నాను."

"ఆ అభిప్రాయంతోనే ఫోన్ చేశారా?"

"అవును" అంది ఇందిర.

"దట్సాల్ యువర్ ఆనర్."

ప్రాసిక్యూషన్ తరువాతసాక్షిగా రామయ్యను కోర్టువారి అనుమతితో పిలుస్తున్నాను, అనటంతో రామయ్య విట్నెస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం స్వీకరించాడు.

"రామయ్యా, చివరసారిగా మీ అమ్మగార్ని ఎప్పుడు చూశావు?" అడిగాడు పి. పి.

"నాలుగు గంటలకు ఇంటికి వెళ్ళుతూ చూశానండి. అమ్మగారు స్నేహితురాలు మంజులత వచ్చింది. ఆ రాత్రి

ఆమె అక్కడ వుంటానంది. సరే అని చెప్పి నేను వెళ్ళి పోయాను."

"నీవు వెళ్ళేటప్పుడు మీ అమ్మగారేం చేస్తున్నారు?"

"మంజులత అమ్మగారితో మాట్లాడుతున్నారు."

"క్లాసు చేసుకోవచ్చు."

పి. జె. ఆలోచించాడు మంజులత ఎవరు? ఏ ఒక్కరు ఆమెగురించి యిప్పటివరకు చెప్పలేదు.

"రామయ్యా మీ అమ్మగారయిన వసుంధర గురించి ఏమయినా చేస్తావు కదూ?"

"ఏమైనా చేస్తాను."

"ఏమయినా చేసేవాడివి మంజులత అనే అమ్మాయి గురించి యిప్పటివరకు నీవు చెప్పక పోవటంలో నీ అభిప్రాయం."

"చెప్పవద్దని బ్రతిమిలాడింది. అందుకే చెప్పలేదు. యిప్పుడు ప్రమాణం చేశానుకదా, అబద్ధం చెప్పకూడదని."

"రామయ్యా నీకు జీతం ఎంత? ఎప్పుడిస్తారు?"

"ఎప్పుడు అమ్మగారు కరక్టు 1వ తారీకు యిస్తారు. నెలకు నూట పాతికరూపాయలు, భోజనం."

"హత్య జరిగిన సమయంలో నీవు ఎక్కడ వున్నావు?"

"ప్రసాద్ సారా కొట్లో త్రాగి వున్నానండి."

"ప్రమాణం చేసి అబద్ధం చెపుతున్నావు, నిజం చెప్పు."

రామయ్యా కంగారుపడ్డాడు "లేదు నిజం."

"కాదు అబద్ధం. 1వ తేది నీకు జీతాలు. 21వ తేదీ నీవు తాగింది. అప్పటివరకు నీ దగ్గర డబ్బులున్నాయా?

పైగా ఆ రోజు నీవు ప్రసాద్ కొట్లో లేవు. ఎక్కడ వున్నావో చెప్పు?"

"తప్పు చెప్పాను. తాగి యింట్లో పడుకున్నానండి."

"అబ్జక్షన్ యువర్ ఆనర్! సాక్షిని అనవసరమైన ప్రశ్నలతో విసిగించటం అసమంజసంగా వుంది."

"నో యువర్ ఆనర్! సాక్షి ఎలిబి కరెక్ట్ కాదు. విట్నెస్ సరైన విధంగా లేదు. కాబట్టి యితనితో యథార్థమే చెప్పిస్తున్నాను. కాని హంతకుడని అనుమానించింది కాదు. మంజులత గురించి యధార్థం చెప్పిన యీ సాక్షి తన గురించి యధార్థం ఎందుకు చెప్పడు."

"అభ్యంతరం త్రోసిపుచ్చుతున్నాను."

"చెప్పు రామయ్య యింట్లో నే ఏం తాగావు?"

"బ్రాంది."

"ఎక్కడిది?"

"మధురాధర్ బాబు యిచ్చాడు."

"ఎందుకు?"

"మిగిలిపోయింది తీసుకు వెళ్ళమన్నాడు."

"ఇదివరలో ఎప్పుడైనా అలా యిచ్చాడా?"

"లేదు."

"యిప్పుడు నీవు అడిగావా?"

"లేదు."

"ఇప్పుడు ప్రత్యేకించి యివ్వటంలో అతని ఉద్దేశం ఏమయి వుంటుందో వూహించి చెప్పగలవా?"

"తెలీదు." బిక్కముఖం వేశాడు.

"దాట్సాల్ యువర్ ఆనర్."

కేసు వాయిదాపడింది.

పి. జె. కోర్టులోనుండి బయటకు వస్తూనే మంజులత గురించి ఆలోచించాడు. యీమె యిప్పటివరకు తెర మరుగున ఉన్న మనిషి. యీమె ద్వారా డిఫెన్స్ని బిల్డప్ నడపవచ్చు.

"నమస్కారమండి" అంటూ ఒకతను వచ్చాడు.

అతడి వయసు నలభైకి పైగా వుంటాయి. ఖద్దరు లాల్చి పంచె రిమ్‌లెస్ కళ్ళద్దాలు. చూపులకు శ్రీమంతుడులా వున్నాడు.

"నమస్తే" కారు ఎక్కబోయి ఆగాడు.

"మీకోసం యిప్పటివరకు వేచి ఉన్నాను."

"ఏం కావాలో చెప్పండి."

"మా అమ్మాయి మంజులత రాత్రి మొదటి ఆట సినిమాకి వెళ్ళింది. ఇంతవరకు రాలేదు. ఎవరయినా స్నేహితురాలి యింటికి వెళ్ళిందేమో అనుకున్నాను. ఎక్కడా లేదు. నాకు ఒక్కటే భయంగా వుంది. నా కూతుర్ని కాపాడండి."

పి. జె. "చూడండి మీరేమి ఆందోళన పడవద్దు. మీ అమ్మాయిని వెదికి అప్పగించే బాధ్యత నాది." భుజం తట్టాడు.

"చూడండి, వసుంధర అనే అమ్మాయి దగ్గరకు మీ అమ్మాయి తరచు వెళ్ళేదా?"

"వెళ్ళేదండి. మా అమ్మాయికి సినిమాలో చేరాలనే ఉబలాటం చాలా ఎక్కువ. వసుంధర ద్వారా సినిమాలో చేరాలని తాపత్రయపడేది. వసుంధర మా అమ్మాయి విషయంలో శ్రద్ధగా వుండేది. ఫస్ట్ క్లాసులో పాసవమని అలా పాసయితే వేషం యిస్తాననేది. ఆ మాటలు నమ్మి మా అమ్మాయి చాలా శ్రద్ధగా చదివేది."

"ఆమె హత్య తరువాత ఆమె గురించి ఏమయినా చెప్పిందా?"

"లేదండి. కాని మనిషి అదోలా వుండేది. అప్పు డప్పుడు ఉలిక్కిపడుతూ ఉండేది. నేనంతగా పట్టిం చుకో లేదు."

"సరే మీరు ధైర్యంగా ఉండండి. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను."

అతను గబగబ జేబులోనుండి డబ్బు తీశాడు.

"ప్రస్తుతం వద్దండి. ఇప్పుడు వాదిస్తున్న కేసులో ఆమె సాక్ష్యం అవసరం కావచ్చు. ప్రయత్నిస్తాను."

పి. జె. కారులో బయలుదేరాడు. ఇప్పటికి ధర్మ వచ్చి ఉండాలి. డిఫెన్సు సాక్ష్యంగా ఏమయినా సంపాదించా డేమో ఆలోచిస్తూ సిగరెట్టు వెలిగించాడు. అనుమానితులు ఒక్కొక్కరే గుర్తుకు వస్తున్నారు. దుర్గ, రామయ్య, మధురాధర్ బాబు, ఇందిర, మంజులత, వీరిలో హంతకు డెవరు?

ఇంటి ముందు పోర్టికోలో కారాగింది.

7

"నమస్తే" పి. జె. తలెత్తి చూసాడు.

నలభై ఐదేళ్ళ పల్లెటూరి రైతులా ఉన్నాడు. క్రొత్త ముఖం అతన్నెప్పుడు పి. జె. చూడలేదు. "మిమ్మల్ని యిదివరలో చూడలేదు. ఇదే మిమ్మల్ని చూడటం. మీరు నమ్ముతానంటే ఒక నిజం చెపుతాను."

"కూర్చోండి. ఏమిటది?"

"దుర్గ, వసుంధర తల్లిగురించి చెప్పటానికి వచ్చాను."

"ఏమిటది?" కుతూహలంగా అడిగాడు.

"దుర్గ భర్త చనిపోకముందు నా ప్రేమికురాలు. భర్త చనిపోయాక ఎప్పుడో అరుదుగా ఆమె నాకు తటస్థపడటం ఏకాంతంగా కొన్ని గంటలు గడపటం జరుగుతుంది. అదృష్టవశాత్తు ఆమె పెళ్ళికి రావటంతో ఇద్దరిలో కోర్కె పెరిగిం దనటంలో సందేహం లేదు. అందుకే ఆమెను తీసుకొని ఇందిరకు తెలియకుండా మా కొబ్బరి తోటలో గడపటం జరిగింది. ఈ విషయం చెప్తున్నందుకు సిగ్గుపడుతున్నాను."

పి. జె. నవ్వాడు "ఫర్వాలేదు చెప్పండి."

"ఇలా నాతో గడిపిన విషయం ఏ ఒక్కరికి తెలియక పోవటం, వసుంధర అదే సమయంలో చనిపోవటం, మీరు ఆమెను అనుమానించటంతో దుర్గ కంగారుపడుతుంది. మీరు డిఫెన్స్ సాక్షిగా ఆమెను వివరాలడిగితే ఏం చెప్తుంది."

పి. జె. తలూపాడు.

"న్యాయం గురించి, చట్టం గురించి నాకు తెలుసు. మీ గురించి నాకు తెలియక పోయినా దుర్గ మీ గురించి చెప్పినదాన్నిబట్టి చాలా సమర్థు లనుకున్నాను. మీరు పూనుకుంటే నిజం బ్రద్దలవుతుంది. నేను చెప్పినందువల్ల నాకు లాభించేది ఏమీ లేదు. నష్టంకూడా లేదు. ఈ నష్టం దుర్గది కాబట్టి మీరు ఆలోచించి చేయండి. నేను చెప్పేది యథార్థం, యథార్థం అని ఋజువు చేయలేను. ఆపై మీ యిష్టం" గంభీరంగా, హుందాగా అన్నాడు.

పి. జె. కొన్ని క్షణాలు ఆలోచించాడు. "అలాగే మీ మాటలు నమ్ముతున్నాను. వెళ్ళిరండి."

"చాలా సంతోషం. వస్తాను. అవసరమయితే మళ్ళీ కలుస్తాను" అంటూ లేచాడు.

"ఒక్క మాట. మీరు మధురాధర్ బాబుకి తెలుసా?" పి. జె. ప్రశ్న.

"అతను నాకు తెలుసుగాని. నేను అతనికి తెలీదు." తర్వాత అతను వెళ్ళిపోయాడు.

8

"హల్లో పి. జె. రండి రండి, ధర్మకూడా వచ్చారే. మిమ్మల్ని చూస్తుంటే జాలేస్తుంది" క్రైంబ్రాంచి ఇన స్పెక్టర్ విజయ్ అన్నాడు.

పి. జె. ఎదురుగా కూర్చొని సిగరెట్టు వెలిగించి "ఎందుకో" అన్నాడు.

"మీకు యింతవరకు అపజయం లేదు. కాని ఒక అనామకుడి కేసు తీసుకొని అపజయం పాలవుతున్నారు."

"అలాగే అనుకోండి. మంజులత గురించి దర్యాప్తు చేస్తున్నారా?"

"ప్రయత్నిస్తున్నాను. వాళ్ళ నాన్న రిపోర్టు వ్రాసి యిచ్చాడు."

"ఆమె ఎక్కడుందో తెలుసుకోవటం అవసరం."

"అంటే యీ కేసు ఉపసంహరించుకున్నారా?"

"లేదు. ఆమె లేకపోతే కేసు వాయిదాపడుతుంది" పి. జె. అనటంతో వింతగా చూశాడు. "అవును. ఆమెను యీ కేసులో డిఫెన్స్ సాక్షిగా కావాలని ఖచ్చితంగా మీరు ప్రవేశపెట్టాలి. ఆ విషయం గుర్తుంచుకొని దర్యాప్తు చేయండి. ఎందువల్లనంటే ముద్దాయికి ముందు హతురాల్ని చివరసారిగా చూసింది ఆమె అని విట్నెస్ వుంది కాబట్టి."

"అంటే ఆమె హత్య చేసిందనా?"

"నో. హత్య చేసిన మనిషే ఆమెను మాయం చేశారు. అంటే హత్య గురించి ఆమెకు తెలిసి వుండాలి. ఆమెకు తెలుసు కాబట్టి కోర్టుకు వచ్చే అవకాశం యివ్వలేదు."

"యిప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"హంతకుడ్ని అనుసరించాలి."

"ఎవరు? మీకు తెలిస్తే చెప్పండి కేసు నేనే ఉప సంహరించుకుంటాను." అన్నాడు ఇనస్పెక్టర్ విజయ్.

పి. జె. నవ్వాడు. "నేను చెపితే మీరు నమ్ము తారా?"

"తప్పనిసరిగా నమ్ముతాను. చెప్పండి ఎవరు?"

"మధురాధర్." ఇనస్పెక్టర్ విస్తుపోయాడు. "అతను మద్రాసులో వున్నట్లు ఎలిబీ వుంది. అది అబద్ధమా?"

"అది నిజమే. అతను మద్రాసులో వున్నాడు."

"మద్రాసులో ఉన్న మనిషి విజయవాడలో ఎలా హత్య చేశాడు. ఎవరి చేతనయినా చేయించాడా?"

"లేదు. తనే చేసి వుండాలి."

"నాకు మతిపోతూంది. ఏమిటి మీర నేది?"

"ముందు మంజులతను పట్టుకోడానికి ప్రయత్నించండి. తరువాత వివరిస్తాను. యీ రాత్రికే ఏర్పాటు" పి. జె. కదిలాడు.

9

చలిగాలి తెరలుగా వీస్తుంది. రాత్రి పది గంటలు దాటింది. ఎవరూ వస్తున్న జాడలేదు. అందరికీ కాస్త అసహనం కలిగింది.

పోర్టికో తలుపు తెరిచాడు మధురాధర్. పోర్టికోలో నుండి కారు బయలుదేరింది.

మధురాధర్ కారు వేగంగా పోతోంది. ఇనస్పెక్టర్ విజయ్ కారు దానిని అనుసరిస్తోంది. అంతకంటె వేగంగా ధర్మ కారు పోతూంది. బందరు రోడ్ అది.

ఆంధ్ర జ్యోతి ఆఫీసు దాటింది, తమలపాకు తోట, యిటికా పైగా కొంత దూరంలో బెంజ్ కంపెనీ రింగ్ రోడ్ సెంటర్ దాటుతూ వుండగా ధర్మ కారు దూసుకొని మధురాధర్ కారుకంటె ముందుకు వెళ్ళింది. పడమట లంక, ఇండస్ట్రియల్ ఎస్టేట్ దాటి ముందుకు సాగింది.

రవీస్ కాలువ ఒడ్డు వెంట కొంత దూరం వెళ్ళాక పోరంకి సమీపంలో ధర్మ ఆగాడు. వెనుక కారు లేదు, రాలేదు. విజయ్ కారు ధర్మ కారును సమీపించింది. "ఏడి" పి. జె. అడిగాడు కారు దిగుతూ.

"యిది దాటి రాలేదు" అన్నాడు ధర్మ.

"అంటే యిక్కడే ఎక్కడో ఆగిపోయి వుండాలి" అంటూ కార్లు బాక్ చేశారు. రెండు ప్రక్కల వెదక సాగారు.

పి. జె. చేతిలో టార్చి, రివాల్వర్ వుంది.

చుట్టూ పొలాలు. దూరంగా పాడుబడిపోయిన ఓ ఇల్లు కనిపిస్తూంది. సందేహంలేదు ఆ యింట్లోనే వుండివుండాలి.

లోపలనుండి ఎవరిదో ఏడుపు సన్నగా విన్పిస్తూంది.

పి. జె. క్షణంలో మెరుపులా లోపలకు దూకాడు,

ఆ వూపుకి క్రింద పడిపోయాడు మధురాధర్. క్షణంలో ధర్మ, ఇనస్పెక్టర్ చుట్టుముట్టారు,

10

ప్రఖ్యాత డిటెక్టివ్ పి. జె. కన్సల్టింగ్ రూములో క్రైం బ్రాంచి ఇనస్పెక్టర్ విజయ్, పోలీసు కమీషనర్,

అసిస్టెంట్ ధర్మ, ఇందిర, మంజులత, మరి కొందరు వున్నారు.

పి. జె. గొంతు సవరించుకున్నాడు.

"ఈ కేసులో మనం గుర్తుంచుకోవలసింది చచ్చిన ఒక బల్లిని! అది చావకపోయినట్లయితే, యిది ఆత్మహత్య గానో, లేదా రామకృష్ణపై హత్యా నేరంగానో మోప బడేది. ఈ కేసులో ముఖ్యమైన 'క్లూ' ఒక బల్లి, మధు రాధర్ని నిందితుడిగా చేసింది ఒక బల్లి అంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు.

"అసలేం జరిగింది. స్వార్థం మనిషిని రాక్షసుడిగా చేస్తుంది. వసుంధర తండ్రి అల్లుడు మధురాధర్ ప్రవర్తన మీద నమ్మకం లేక ఆస్తి యావత్తు వసుంధర పేర వ్రాశాడు. దురదృష్టవశాత్తు వసుంధర యాక్సిడెంట్లో స్పయిన్ యింజరీకి లోనయింది. డబ్బుమీద ఆపేక్ష, రోగిష్టి భార్యను వదిలించుకోవటానికి మధురాధర్ యీ హత్య చేయటానికి సంకల్పించాడు. దానికి ఒక పథకం వేశాడు.

"ఏ పరిస్థితిలోను తనపై ఎవ్వరికి అనుమానం కలగ కూడదు. దానికి ఒక మిషన్ తయారుచేశాడు. ఏమిటా మిషన్? వెరిసింపుల్. వసుంధర తండ్రి ఫోటో వెనుక ఒక ఇనుప బీరువా ఉంది. ఆ బీరువాలో చిన్న స్టాండుకు రివాల్వర్ అమర్చాడు. ట్రిగర్ నుండి దారం బీరువా డోర్కు కట్టాడు. అంటె ఎవరయినా బీరువా గబాలున తీస్తే ట్రిగ్గర్ ఆటోమేటిక్గా క్లిక్ అవుతుంది. ఎవరయితే డోర్ తీశారో ఆ మనిషి చచ్చిపోతాను."

"ఇందిర, దుర్గ నిడమానూరు పెళ్ళికి వెళతారని తెలుసు. ఇకపోతే రామయ్య. వాడికి బ్రాందీ సీసా ఇస్తే

పండుగ. అందుకే సీసా ఇచ్చాడు. మద్రాసులో స్వరూప్ హోటల్ లో పార్టీ చేశాడు. చాలామంది ప్రముఖులమధ్య ఉండటం బ్రహ్మాండమయిన ఎలిబీ. అందుకే పార్టీ చేసి ఎలిబీ సృష్టించుకొని సరిగ్గా 5.30 గంటలకు ట్రంకాల్ చేశాడు. ఏదో మిష పెట్టి బీరువా తియ్యి అన్నాడు. తీసే ముందు ఎవరయినా వున్నారా? అని ప్రశ్నించాడు. అయితే అప్పటికి మంజులత ఉంది. కాని వసుంధర లేదు అని చెప్పటంతో బీరువా తీయమన్నాడు."

బీరువా తీసింది వసుంధర. తలలో గుండు దూసుకు పోయింది సరిగ్గా. ఇదంతా చూసిన మంజులతకు మతి పోయింది. ఏంచేయాలో తోచక భయపడి పారిపోయింది.

"సరిగ్గా మధ్యరాత్రిలో ప్రవేశించాడు రామకృష్ణ. దొంగతనానికి వచ్చినతను అదే గదిలో శవం ఉండటంతో ఉక్కిరి బిక్కిరయి వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. అయితే రామకృష్ణ అప్పటికి ఇనుపపెట్టె అందులో రివాల్వర్ చూడలేదు."

"వీళ్ళిద్దరి విషయం మధురాధర్ కి తెలీదు. సర్కార్ లో బయలుదేరాడు. కాని సర్కార్ లో ప్రయాణం చేయలేదు. మీనంబాకం విమానాశ్రయానికి వెళ్ళి ప్లెయిన్ లో 4-30 తెల్లవారుఝామున విజయవాడ గన్నవరం వచ్చి ఎవ్వరూ చూడకుండా రివాల్వర్ తీసి అది వసుంధర చేతిలో పెట్టాడు. రివాల్వర్ కు కట్టిన దారం కాల్చివేశాడు. లోపల గడియవేసి వెంటిలేటరుగుండా—అది బాత్ రూమ్ లో వుంది. దానిలోనుండి బయటకు వచ్చేశాడు."

"అయితే ఎదురు డోర్ వేసినపుడు బల్లి తలుపుమధ్య ఇరుక్కుపోవటంతో 'క్లూ' దొరికింది. బయటకు వచ్చిన మధురాధర్ టాక్సీలో బయలుదేరి గుంటూరు వెళ్ళి తను

రిజర్వ్ చేసిన సీట్లో కూర్చొని మామూలుగా విజయవాడ చేరాడు. ఇవన్నీ ధర్మా ఇన్వెస్టిగేషన్‌లో తెలిసాయి. ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ లిస్ట్, వారి అడ్రసులు సంపాదించి ఎంక్వయిరీ చేశాడు.''

''మధురాధర్ ఎలిబీనిబట్టి ఇనస్పెక్టర్ అతన్ని అనుమానించలేదు. మధురాధర్ ఏ ఒక్కరూ అనుమానించలేని రీతిగా ప్రయత్నించాడు. అయితే మంజులత ఇనుపపెట్టి, అందులో రివాల్వర్ పేలటం చూసింది. మంజులత ఆ సమయంలో ఇంట్లోనే వున్న విషయం ఎలాగో తెలుసుకున్నాడు మధురాధర్. ఈ నేరం తనపైకే వస్తుందని మధురాధర్ మంజులతను మాయం చేశాడు. ఆ అవకాశం ఒక్క మధురాధర్‌కి మాత్రం వుందని అతనిపై నిఘా వేశాను. పథకం ప్రకారం తను పోరంకి ప్రాంతంలో మంజులతను బంధించిన యింట్లోనుండి మంజులను రక్షించాము.''

''ఏది ఏమయినా హంతకుడ్ని పట్టుకున్నారు'' విజయ్ నవ్వుతూ అన్నాడు.

పి. జె. నవ్వాడు. ''ఇందులో నేను నిమిత్తమాత్రుడ్ని అయితే నిజాన్ని దాచటం నిప్పును మూటగట్టటం లాంటిది. అందుకే మధురాధర్ ముద్దాయి అయ్యాడు. ఇందులో నా అసిస్టెంట్ ధర్మ ప్రయత్నం చాలా వుంది. అతను సహకరించి దర్యాప్తు చేయకపోతే రామకృష్ణ శిక్ష అయ్యేక దర్యాప్తు ముగిసేది.''

—: ఐ పో యిం ది :—